క్లుప్తంగా

నారాయణలంకలో వైద్యసేవలు



రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ రామకృష్ణ

కపిలేశ్వరపురం: ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కపిలేశ్వరపురం గ్రామ శివారు నారాయణలంకలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యాధికారి బి.అనంత రామకృష్ణ రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు. శిబిరానికి రాలేని రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యసేవలందించారు. ఎంఎల్‌హెచ్‌పీ పి.దివ్య, ఎంపీహెచ్ఎ తోటకూర రామకృష్ణ, సచివాలయ ఏఎన్ఎం పలివెల శిరోమణి, ఆశ వర్కర్ పిల్లా సుబ్బలక్ష్మి సేవలందించారు. పంచాయతీ వార్డు సభ్యులు త్రిమూర్తులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



కేదారిలంక ప్రాథమిక పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న షైనాజ్

కపిలేశ్వరపురం: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, నిర్దిష్ట వయస్సు పూర్తయ్యే వరకూ చిన్నారులు విద్యాలయంలో విద్యనభ్యసించాలని కేదారిలంక మహిళా పోలీస్ షైనాజ్ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేదారిలంక, వీధివారిలంక ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో శుక్రవారం గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బడి బయట పరిస్థితులు, కుటుంబ పరిస్థితులు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రహదారి నిబంధనలపు అవగాహనతో మెలగడం ద్వారా ప్రమాదాలను నివారించగలుగుతామన్నారు.

బాలలు హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



వెల్ల జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై దుర్గ

రామచంద్రపురం రూరల్: బాలలు తమ హక్కులు, భద్రత పట్ల అవగాహన పెంచుకోవాలని దిశ ఎస్సై దుర్గ విద్యార్థులకు సూచించారు. మండలంలోని వెల్ల జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం ఆమె విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు లైంగిక వేధింపులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చట్టం చిన్నారులకు ఏ విధంగా సహకరిస్తుందనే దానిపై వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వీరభద్రరావు, గ్రామ మహిళా పోలీసులు ఉమామహేశ్వరి, తేజ, సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, ఎంపీటీసీ చిక్కాల స్వామికాపు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనాల నిర్మాణం



నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులు

కపిలేశ్వరపురం: నేలటూరులో రూ.11.50 లక్షల అంచనా వ్యయంతో మూడు మినీ కమ్యూనిటీ భవనాల నిర్మాణాలు చేపట్టారు. గ్రామంలోని ఎస్సీ ఏరియాల్లోని రెండు ప్రాంతాల్లో శుక్రవారం అంబేడ్కర్ మినీ కమ్యూనిటీ హాళ్ల భవన శ్లాబ్ నిర్మాణ పనులను చేపట్టారు. పంచాయతీరాజ్ జేఈ డీవీ రాఘవులు ఆదేశాలపై పనులను గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ నిమ్మకాయల పద్మరాజు పర్యవేక్షిస్తున్నారు.

ఘనంగా ఎల్ఐసీ ఆవిర్భావ దినోత్సవం

రామచంద్రపురం: భారతీయ జీవిత బీమా సంస్థ, 67వ ఆవిర్భావ దినోత్సవం స్థానిక ఎల్ఐసీ బ్రాంచ్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఎస్ఎస్ఎస్‌జీ కిషోర్, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దేశ ఆర్థిక ప్రగతిలో జీవిత బీమా సంస్థ చేస్తున్న సేవలను వివరించారు. ప్రజల సొమ్మును, సమాజ సంక్షేమానికి వినియోగించాలనే జాతీయకరణ లక్ష్యాన్ని నిబద్ధతతో నిర్వర్తించిన సంస్థ ఎల్ఐసీ అన్నారు. బ్రాంచి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి.రాంజీ మాట్లాడుతూ బీమా వారోత్సవాల సందర్భంగా, స్థానిక స్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, మొక్కలు నాటడం సెప్టెంబర్ 7న వారోత్సవాల ముగింపు నిర్వహిస్తామన్నారు. బ్రాంచ్‌లో సీనియర్ ఉద్యోగి ఎంపీఆర్ చౌదరిని ఘనంగా సత్కరించారు. సేల్స్ ఏబీఎం శంకర్, యూనియన్ నాయకులు సతీష్, బంధకవి రామారావు, డెవలప్‌మెంట్ ఆఫీసర్స్ తరపున పి.అన్వేష్, ఏజెంట్స్ తరపున పాలకుర్తి సత్యనారాయణ, పట్టాదారులు, ఏజెంట్స్, సిబ్బంది పాల్గొన్నారు.

జనరంజకం

- తక్కువ ధరలకు జనరిక్ మందులు
- నాణ్యత ఎక్కువ, ఆర్థిక భారం తక్కువ
- క్రానిక్, సీజనల్ వ్యాధులతో పెరిగిన మందుల వినియోగం



మందులు



రామచంద్రపురంలోని జనరిక్ మందుల షాపు

కపిలేశ్వరపురం: ఆధునిక కాలంలో మనిషి తరచూ అనారోగ్యానికి గురవుతున్నాడు. ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లగానే రోగికి వైద్యుడు పలు రకాల మందులను రాసివ్వడం సహజం. మందుల కొనుగోలుపై ప్రజలకు అవగాహన లేక ఆర్థికభారం మోస్తున్నారు. అందులో బ్రాండెడ్ కంపెనీ మందులు సామాన్య ప్రజలకు మరింత భారంగా మారాయి. వారికి జనరిక్ మందులపై అవగాహన లేకపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నారు. జనరిక్ మందుల వినియోగాన్ని పెంచాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రజల్లో అవగాహన కల్పిస్తోంది. జనరిక్ మందుల వినియోగంపై ఈ కథనం..

జనరిక్ షాపుల ఏర్పాటు నేపథ్యమిదీ

సామాన్యులకు తక్కువ ధరలకే ఔషధాలను అందించాలన్న ప్రధాన లక్ష్యంతో 2015లో జనరిక్ దుకాణాలను ఏర్పాటు చేసినప్పటికీ అప్పటి రాష్ట్ర ప్రభుత్వం వాటి సంఖ్యను విస్తృతపర్చలేదు. రామచంద్రపురం పట్టణంలో 3, మండపేటలో 2, ద్రాక్షారామ, కాజులూరు, కె.గంగవరంలలో ఒక్కొక్కటి చొప్పున ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల్లో జనరిక్ షాపులున్నాయి. మండపేట నియోజకవర్గంలో 7, రామచంద్రపురంలో 9 మొత్తం 16 పీహెచ్‌సీలు, పలు సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల ద్వారా ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందుతుంది. వాటితో పాటు పలు జనరిక్ షాపులను విస్తృతపర్చే చర్యలు చేపట్టింది.

భారం తగ్గేదిలా...

ప్రైవేటు షాపుల్లో మందులను ఎమ్మార్పీ ధరలకే విక్రయిస్తున్నప్పటికీ ఆ ఎమ్మార్పీ రేటు నిర్ధారణలోనే కంపెనీలు లాభార్జనకు అధిక ప్రాధాన్యమిస్తున్నాయని ప్రజా సంఘాల నాయకులు చెబుతున్నారు. తయారీదారులు, డిస్ట్రిబ్యూటర్లు, రిటైల్ దారులు ఇలా పలు చేతులు మారాల్సి ఉండడంతో ధర అధికంగా ఉండటానికి ఓ కారణమంటున్నారు. ప్రైవేట్ షాపుల విక్రయాలతో పోలిస్తే జనరిక్ దుకాణాల్లోని మందుల ధరలు 10 నుంచి 80 శాతం పైగా తక్కువ ఉంటుంది. పారాసిటమల్ 10 మాత్రలు ధర జనరిక్ షాపులో రూ.12 కాగా ప్రైవేట్ షాపులో రూ.20 నుంచి రూ.30 ఉంటుంది. బీపీ 10 మాత్రలు ధర జనరిక్‌లో రూ.12 కాగా బ్రాండెడ్‌లో రూ.80, షుగరు 10 మాత్రలు జనరిక్‌లో రూ.15 కాగా బ్రాండెడ్‌లో రూ.50, జింక్ మల్టీ విటమిన్ 15 మాత్రలు జనరిక్‌లో రూ.20 కాగా బ్రాండెడ్‌లో 105, గ్యాస్టిక్ 15 మాత్రలు జనరిక్‌లో రూ.15 కాగా బ్రాండెడ్‌లో 135, సి విటమిన్ పది మాత్రలు ధర జనరిక్‌లో రూ.40 కాగా ప్రైవేట్ షాపులో రూ.70, డి.విటమిన్ నాలుగు క్యాప్సుల్స్ ధర జనరిక్‌లో రూ.40 కాగా ప్రైవేట్‌లో రూ.90 ఉన్నాయి.

జనరిక్ షాపులోనే కొంటా..



వైద్యులు జనరిక్ మందులు మంచివని చెప్పారు. నాణ్యతపై అపోహలు వీడాలని సూచించారు. నాణ్యమైన మందులు సాధారణ షాపులకంటే తక్కువ ధరకు లభ్యమవుతున్నాయి. నా కుటుంబ సభ్యులు కోసం నేను జనరిక్ షాపులోనే మందులను కొంటున్నాను.

– పీవీ రమణ, వల్లూరు, కపిలేశ్వరపురం మండలం.

అపోహలొద్దు



జనరిక్ మందులను పూర్తి ప్రభుత్వ పర్యవేక్షణలో విక్రయిస్తారు. వాటి నాణ్యత విషయంలో అపోహలను వీడాలి. పేదలకు అందుబాటులో ఉండటం కోసం జనరిక్ మందుల ధర తగ్గించారు. దాన్ని తక్కువ నాణ్యతగల మందులుగా భావించరాదు. డాక్టరు రాసిన చీటి మేరకు నిశ్చింతగా జనరిక్ షాపులో మందులను కొనుక్కోవచ్చు.

– డాక్టర్ జి.అనూజ ప్రియాంక, అర్బన్ పీహెచ్‌సీ, రామచంద్రపురం పట్టణం

ఎమ్మెల్సీ తోటపై అసత్య ప్రచారం సరికాదు

- ఎమ్మెల్యే వేగుళ్ల వ్యాఖ్యలపై మురళి ధ్వజం
- టీడీపీ నాయకుడు మురళి మండిపాటు
- ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నానని వెల్లడి



మీడియాతో మాట్లాడుతున్న మురళి

మండపేట: పార్టీలు, కుల, మతం చూడకుండా ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుపై ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు దుష్ప్రచారం చేయడం సరికాదని మండలంలోని ఏడిదకు చెందిన టీడీపీ నాయకుడు లంకలపల్లి మురళి అన్నారు. టీడీపీ కార్యాలయంలో గురువారం జరిగిన పార్టీ సమావేశంలో ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ ఏడిదలో లంకలపల్లి వారి సెటిల్‌మెంట్ వ్యవహారం అందరికీ తెలుసునని ఎమ్మెల్సీ తోటపై చేసిన వ్యాఖ్యలను మురళి ఖండించారు. ఏడిదలోని తన స్వగృహంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్సీ తోట తమకు సెటిల్‌మెంట్ చేసి కమీషన్లు తీసుకోలేదని, న్యాయం మాత్రమే చేశారని స్పష్టం చేశారు. రాజమహేంద్రవరానికి చెందిన తన సమీప బంధువు, ఫైనాన్స్ వ్యాపారి లంకలపల్లి శ్రీనివాసరావు తమకు ఇవ్వాల్సిన సొమ్ములు ఇవ్వకుండా ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తుంటే తమ సొంత సామాజికవర్గంలోని ఎంతో మంది నాయకుల వద్దకు వెళ్లగా ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్సీ తోటను ఆశ్రయించగా టీడీపీ నాయకున్ని అని కూడా చూడకుండా తమకు అండగా నిలిచి న్యాయం జరిపించారన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్సీ తోట సెటిల్‌మెంట్ చేశారనడం సరికాదని మురళి పేర్కొన్నారు. ఆపద సమయంలో తమకు అండగా నిలవాల్సింది పోయి ఎమ్మెల్యే వేగుళ్ల రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. ఆయన తీరును నిరసిస్తూ టీడీపీకి రాజీనామా చేస్తున్న ఆయన ప్రకటించారు. ఎమ్మెల్సీ తోట నాయకత్వంలో నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయానికి పని చేస్తానన్నారు.

ప్రతి గ్రామం నుంచి మట్టిని సేకరించాలి



కోటిపల్లిలో మట్టిని సేకరిస్తున్న బీజేపీ నాయకులు

కె.గంగవరం: బీజేపీ జాతీయ పార్టీ పిలుపు మేరకు అన్ని గ్రామాల నుంచి మట్టిని సేకరించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు సూచించారు. మండలంలోని కోటిపల్లిలో బుధవారం మా మట్టి మా దేశం కార్యక్రమంలో భాగంగా మట్టిని సేకరించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల ఒకటి నుంచి 15వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి మట్టిని సేకరించి కలశంలో భద్రపరచాలని కోరారు. ప్రతి కార్యకర్త పంచనియమ ప్రతిజ్ఞ చేయాలని సేకరించిన మట్టి దేశ రాజధానిలో పవిత్ర అమృతవాటిక నిర్మాణానికి ఉపయోగిస్తారని పేర్కొన్నారు. ప్రతి బీజేపీ కార్యకర్త ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. జిల్లా ఇన్‌చార్జ్ పొట్లూరి రామ్మోహన్, మండల అధ్యక్షుడు ఏవీ రమణమూర్తి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలతో ఆక్రమణల తొలగింపు



గాజులగుంట కాలువపై జేసీబీతో ఆక్రమణలు తొలగిస్తున్న ఏఈ సుందర్‌సింగ్

పి.గన్నవరం: గాజులగుంట కాలువ శివారు ప్రాంత భూములకు సాగు నీరు అందడం లేదని రైతులు ఆందోళన చేపట్టిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాలతో ఆక్రమణలు, పూడిక తొలగింపు పనులు నిర్వహిస్తున్నారు. తమ భూములకు సాగు నీరు అందడం లేదని గాజులగుంట, ముంగండపాలెం రైతులు ఇటీవల ఆందోళన నిర్వహించిన విషయం విదితమే. ఈ కాలువపై 320 ఎకరాల భూమి సాగవుతోంది. రైతుల ఆందోళన విషయాన్ని ఇరిగేషన్ ఏఈ డి.సుందర్ సింగ్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో కాలువలో పూడిక తొలగింపునకు కలెక్టర్ రూ.2.7 లక్షలు మంజూరు చేశారు. దీంతో కాలువలో పూడిక తొలగింపు పనులు నిర్వహిస్తున్నారు. కాలువ మెయిన్ రోడ్డు పక్కన ప్రవహిస్తోంది. పలు షాపుల వద్ద కాలువపై బల్లలు, పక్కా శ్లాబులు నిర్మించారు. కాలువలో పూడికతో పాటు, బల్లలను తొలగించారు. పక్కాగా శ్లాబులు వేసిన ప్రాంతాల్లో ఆరు అడుగులకు ఒక మ్యాన్‌హోల్ ఏర్పాటు చేసి, పూడిక తీస్తున్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ సిబ్బంది, సంబంధిత రైతులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జీ-20 దేశాల సమావేశం

అంబాజీపేట: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం కె.సాయిరామ్ ఆధ్వర్యంలో జీ.20 దేశాల సమావేశ (మాక్) నమూనాను విద్యార్థులతో శుక్రవారం నిర్వహించారు. ఈ నెల 9, 10వ తేదీల్లో ఢిల్లీలో శిఖరాగ్ర సమావేశం జరగనున్న సందర్భంగా విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. జీ-20 దేశాల ప్రతినిధులుగా 20 మంది విద్యార్థులకు తర్ఫీదునిచ్చామన్నారు. హెచ్ఎం సాయిరాం యూఎన్ఓ సెక్రటరీగా మాట్లాడుతూ ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న పర్యావరణ సవాళ్లను అధిగమించి, సుస్థిర అభివృద్ధి సాధించాలని జీ-20 దేశాలను కోరారు. వివిధ దేశాల పాత్రలో విద్యార్థులు పలువురిని అలరించారు. కార్యక్రమంలో మహ్మద్ ఉన్నీసా బేగం, ఎల్.వెంకటేశ్వరరావు, ఎ.ఆనందకుమార్‌లు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో పేరుకే ప్రజాస్వామ్యం



చేదువాడలో ఆందోళన చేస్తున్న కౌలు రైతు సంఘాల నాయకులు

కాజులూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పాలనలో పేరుకే ప్రజాస్వామ్యం నడుస్తోందని ఆచరణలో ఎక్కడా అది కానరావడం లేదని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజుబాబు అన్నారు. ధరల పెరుగుదలను నిరసిస్తూ మండలంలోని చేదువాడ తదితర గ్రామాల్లో కౌలు రైతు సంఘాల నాయకులు శుక్రవారం ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. రాజుబాబు మాట్లాడుతూ నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి 10 రోజులకు గ్యాస్, డీజిల్ ధరలను పెంచుతూ పోతుందని ఇంధన ధరలు పెరుగుతుండటంతో పరోక్షంగా నిత్యావసర ధరలు పెరిగి సామాన్యులపై తీవ్ర భారం పడుతుందన్నారు. విద్యుత్ బిల్లుల పెరుగుదల పేదలకు ఇబ్బందులుగా మారిందన్నారు. ప్రభుత్వాలు స్పందించి ధరల పెరుగుదలను నియంత్రించాలన్నారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘాల నాయకులు కురుపూడి భూచక్రం, మేడిశెట్టి మేరి, జి.అనంతలక్ష్మి, ఉబ్బన వరలక్ష్మి, నల్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ

కొత్తపేట: స్థానిక బోడిపాలెం సెంటర్‌లో విజయదుర్గా అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ, జీవ ధ్వజస్తంభ, లక్ష్మీదేవి శిలా విగ్రహ ప్రతిష్ఠ, బలిపీఠం, సింహవాహన సంపూర్ణ ప్రతిష్ఠ మహోత్సవానికి సంబంధించి వివిధ పూజలు, హోమాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. దానిలో భాగంగా రెండోరోజు శుక్రవారం ఉదయం నుంచీ వేదపండితులు వివిధ పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారి ఊరేగింపు, గ్రామోత్సవం, రాత్రి అగ్నిమథనం, కుంభపూజ తదితర కార్యక్రమాలు జరిపారు. కాగా శనివారం శ్రీమాన్ సుదర్శనం వెంకటజనార్దనాచార్యుల ఆధ్వర్యంలో పండితుల బృందం బొరుసు వెంకటఉదయభాస్కర్, వసుధ దంపతులతో విగ్రహాలు, ధ్వజస్తంభం ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమాల్లో భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

గుర్తింపు కార్డులు మంజూరు చేయాలి

రాజోలు: కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేస్తుందని ఏఐటీయూసీ నాయకుడు దేవ రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం వేగివారిపాలెంలో జిల్లా కార్మిక శక్తి పెయింటర్స్ యూనియన్ సమావేశం జరిగింది. కార్మిక హక్కులకు, రక్షణకు భంగం కలిగించే చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేబర్ కమిషన్ కార్మికులకు తక్షణమే గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

మెరుగైన పారిశుధ్య నిర్వహణే లక్ష్యం



మస్టర్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: పట్టణ ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందించడమే లక్ష్యంగా పారిశుధ్య కార్మికులు పనిచేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికుల మస్టర్ రిజిస్టర్‌ను శుక్రవారం చైర్‌పర్సన్ దుర్గారాణి పరిశీలించారు. అనంతరం కొద్దిసేపు కార్మికులతో ముచ్చటించారు. ప్రజారోగ్య పరిరక్షణలో పారిశుధ్య కార్మికుల సేవలు కీలకమన్నారు. సమర్థవంతంగా పనిచేయడం ద్వారా మెరుగైన పారిశుధ్య నిర్వహణకు సహకరించాలని కోరారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావణ్య, శానిటరీ సెక్రటరీలో పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ తోట పరామర్శ



పసలపూడిలో పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

రాయవరం: మాజీ జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షురాలు చిన్నం అపర్ణాదేవి భర్త వెంకట పుల్లేష్‌ను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు శుక్రవారం సాయంత్రం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన వెంకటపుల్లేష్‌ను పరామర్శించి, యోగక్షేమాలను అనంతరం ఎమ్మెల్సీ త్రిమూర్తులు సచివాలయం, వెల్‌నెస్ సెంటర్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు చింతా సుబ్బారెడ్డికి సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ పోతంశెట్టి సాయిరామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు పోతంశెట్టి సత్తిబాబు, చిన్నం వెంకటకృష్ణారెడ్డి, మల్లిడి వీర్రాఘవరెడ్డి, కర్రి శివానందరెడ్డి, పార్టీ తదితరులున్నారు.

విద్యాభివృద్ధితోనే సమాజం పురోగతి

కాజులూరు: విద్యాభివృద్ధితోనే సమాజం పురోగతి చెందుతుందని మండల తహసీల్దార్ బి.సాయి సత్యనారాయణ అన్నారు. గొల్లపాలెం శివారు ఊడావారి పేటలో శుక్రవారం సర్పంచ్ పోతురాజు ప్రసన్నమౌనిక అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన చట్టాలను, హక్కులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ, ఎస్టీ వర్గాలలోని ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావటం ద్వారా కుల, ఆర్థిక అసమానతలు తొలగిపోయి సమాజం పురోగతి దిశలో పయనిస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు బాబూరావు, ఎంపీటీసీ జొన్నకూటి పద్మజ, ఆర్ఐ వేగేశ్వరరావు, కానిస్టేబుల్ శివ, వీర్వోలు ఈశ్వరరావు, వరలక్ష్మి, జొన్నకూటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మారేడుబాకలో టీడీపీ ప్రచారం

మండపేట: భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులు శుక్రవారం మారేడుబాకలో పర్యటించారు. మాజీ సీఎం చంద్రబాబు ప్రకటించిన మినీ మ్యానిఫెస్టోను వివరిస్తూ స్థానికులకు కరపత్రాలను అందజేశారు. విత్తనాల వాణి శ్రీదేవి, వలీజానీ, నక్కిరెడ్డి కనకవల్లి, గుత్తుల వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి మండల పోటీలు

మామిడికుదురు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీటీ) టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ నిర్వహణపై మామిడికుదురు ఎమ్మార్సీ కేంద్రంలో ఎంఈఓ మోకా వెంకటన్నబాబు అధ్యక్షతన శుక్రవారం సమావేశం జరిగింది. తొమ్మిది విభాగాల్లో ఎస్‌జీటీ పోటీలు జరుగుతాయని ఎంఈఓ వెంకన్నబాబు, మండల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ మట్టా శ్రీధర్ తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్, త్రోబాల్, టెన్నికాయిట్, యోగా, అథ్లెటిక్స్‌ను ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు మూడు రోజుల పాటు మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈ పోటీలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఈ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రాజోలు: రోడ్డు ప్రమాదంలో రాజోలుకు చెందిన బంగారం వెంకటరమణమూర్తి (40) మృతి చెందాడు. పొదలాడలో గురువారం రాత్రి ప్రమాదం జరిగింది. శుక్రవారం రాజోలు ఎస్సై పృథ్వీ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాటిపాకలోని బైక్ షోరూమ్‌లో పని చేసుకుంటున్నాడు. పని ముగించుకుని తాటిపాక నుంచి రాజోలు వస్తుండగా వెనుక వైపు నుంచి ఒక యువకుడు తన బైక్‌తో బలంగా ఢీ కొట్టాడు. దీంతో రమణమూర్తి అక్కడిక్కడే మృతి చెందాడు. శుక్రవారం రాజోలు ప్రభుత్వాస్పత్రిలో వెంకటరమణమూర్తి మృతదేహానికి పోస్టుమార్టమ్ నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

- ఘనంగా మూడో శ్రావణ శుక్రవారం
- పాల్గొన్న మహిళలు



ద్రాక్షారామలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ సమీపాన బియ్యంపేటలో పర్వతవర్ధినీ సమేత సప్తకోటి రామలింగేశ్వస్వామి ఆలయం వద్ద శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. చింతా శ్రీనివాస విజయభాస్కర సోమయాజి(భాస్కర్), మేడవరపు రామ్‌కుమార్‌ల బ్రహ్మత్వంలో మహిళలు భక్తిశ్రద్ధలతో వ్రతాలు నిర్వహించుకున్నారు. ద్రాక్షారామ ఖజానా జ్యూయలర్స్ యజమాని శేక్ దినేష్ దంపతులు వ్రతాల్లో పాల్గొన్న 180 మంది మహిళలకు పూజా సామగ్రి, వెండి వరలక్ష్మీ రూపులు ఉచితంగా అందజేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు.

కె.గంగవరంలో..

కె..గంగవరం: మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల వద్ద శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ఘనంగా నిర్వహించారు. పామర్రులో కొలువైన ఉమా పార్వతీ సమేత మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద ఏటా వరలక్ష్మీ వత్రాలను ఆచరించడం ఆనవాయితీ. ఈ ఏడాది కూడా గ్రామస్తులు, దేవస్థానం ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య మహిళలు సామూహిక వరలక్ష్మీ వత్రాలను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గ్రామానికి చెందిన దాతల వరలక్ష్మీ పూజలకు వచ్చిన మహిళలకు ఉచితంగా వరలక్ష్మీ వెండి రూపులు అందించారు.

మండపేటలో..

మండపేట: శ్రావణ శుక్రవారంను మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పట్టణంలోని కలువపువ్వు సెంటర్, కొండపల్లి వారి వీధి, బురగుంట చెరువు సీతారామక్షేత్రంలోని మహాలక్ష్మి అమ్మవారు, ఏడిద రోడ్డులోని పెద్దమ్మ తల్లి ఆలయాలను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. తమ ఇంట సిరి సంపదలు కలుగజేయాలని వేడుకుంటూ వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి ఇంట వరలక్ష్మి వ్రత పూజలు ఘనంగా జరిగాయి. వేడుకకు హాజరైన వైఎస్సార్ సీపీ మహిళ కౌన్సిలర్లకు దుర్గారాణి వాయినాలు అందజేశారు. కౌన్సిలర్లు ఎర్రన ప్రభావతి, కొవ్వాడ బేబి, మలసాని సీతామహలక్ష్మి, శెట్టి కల్యాణి, నాయుడు లక్ష్మీసౌజన్య, బొక్కా సరస్వతి, ముక్కా లోవలక్ష్మి, జొన్నపల్లి విజయలక్ష్మి, అమలదాసు లక్ష్మి, నీలం దుర్గ, మొండి భవాని, పార్టీ నాయకురాలు కొప్పిరెడ్డి పద్మావతి, పేరూరి మాధవి తదితరులు పాల్గొన్నారు.



పామర్రులో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ఆచరిస్తున్న భక్తులు



మహిళా కౌన్సిలర్లకు వాయినాలు అందజేస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి